# బాలమిత్ర

- వాసంతి మాఘుపు.

పద్యము: *నీవే తల్లివి తండ్రివి*
*నీవే నా తోడు నీడ నీవే సఖుడా*
*నీవే గురుడవు దైవము*
*నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా!*

సఖుడు =స్నేహితుడు;

శ్రీ కృష్ణ శతకములోని ఈ పద్యము దైవభక్తిని గురించి, శరణాగతిని గురించి తెలియజేస్తుంది.

అర్థం: *కృష్ణా! నీవే నాకు తల్లి, తండ్రి, తోడు, నీడ, స్నేహితుడవు, గురుడవు, దైవము, ప్రభువు. నీవే నాకు దిక్కు.*

పద్యము: *బలమెవ్వడు కరి బ్రోవను*
*బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్*
*బలమేల సుగ్రీవునకు*
*బలమెవ్వడు నాకు నీవె బలమా కృష్ణా!*

కరి = ఏనుగు;

బ్రోవ = కరుణింప;

అర్థం: *కృష్ణా! గజేంద్రుడు మొసలి బారినుండి బయటపడడానికి నీవె బలమిచ్చితివి కదా! పాండవుల పత్ని ద్రౌపదిని మానము కాపాడుటలో నీవే బలమైతివి. సుగ్రీవునికి కొండంత బలమునిచ్చినది నీవే కదా! నాకు కూడ నీవు తప్ప ఎవరు బలము?*

* * *

పద్యము: లావుగలవాని కంటెను
భావింపగ నీతిపరుడు బలవంతుండౌ
గ్రావంబంత గజంబును
మావటివాడెక్కినట్లు మహిలో సుమతీ!

గ్రావంబు = పర్వతము;

గజంబు = ఏనుగు;

అర్థం: *లోకములో శరీరబలమున్నవాని కంటె నీతితో మెలగువారు బలవంతులుగా భావించుకోవాలి. ఇది ఎలాగంటె పర్వతమంత ఏనుగును ఆకారములో చిన్నవాడైన మావటి లొంగదీసికుని ఎక్కినట్లు. కావున దేహబలముకన్నా బుద్ధిబలము గొప్పదని అర్థము.*

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 6 అక్షరముల మెదక్ జిల్లాలోని ఊరి పేరు.
2. మొదటి రెండు అక్షరములు త్రేతాయుగ నాయకునికై పిలుపు.
3. మూడు, నాలుగు అక్షరములు రేరాజు పిలుపు.
4. ఐదు, ఆరు అక్షరములు 'నగరం' అనే అర్థాన్నిస్తాయి.
5. మూడు, ఐదు అక్షరములు సంహరించు అనే అర్థాన్నిస్తాయి.

**ఏమిటా పదము?**

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. క్షీరసాగర మథన సమయములో పుట్టిన అనేకములలో ఒకటి, ఆయుర్వేదానికి అధిష్ఠాన దేవత, నవరత్నములలో ఒకరు **ధన్వంతరి.**
2. చేయి, తొండము అనే అర్థము కలిగిన 3 అక్షరముల పదము **కరము.**

**సామెతలు:** అప్పు చేసి పప్పుకూడు.
అప్పులేని వాడే అధిక సంపన్నుడు.

**పొడుపు కథలు:** భూమాతకు ముద్దుబిడ్డ;
ఆకాశపు జున్నుగడ్డ;
రాత్రివేళ రాజరికం;
పగలయితే పేదరికం. (ఆఇఇంఇ)

*తప్పు- ఒప్పు: ద్రౌపతి అని వ్రాయడం తప్పు. ద్రౌపది అని వ్రాయడం ఒప్పు.*

# సమైక్యత

సమైక్యత అంటే ఏమిటి? అత్యాశ లేకుండా మనకి ఉన్నదానిని మిగతావారితో పంచుకుంటూ కలసిమెలసి సుఖవంతమైన జీవితము గడపడమే సమైక్యత అంటే. ఈనాటి ప్రపంచములో వ్యక్తుల మధ్య, తెగలమధ్య, దేశముల మధ్య ఘర్షణ మనకు తెలిసినదే! మనమెప్పుడూ మనమేగొప్ప అని ఇతరులతో పోట్లాడుతాము. నిజానికి ప్రతివ్యక్తి ఏకైక వ్యక్తిత్వము కలిగి ఏదో ఒక విషయములో గొప్పవాడే! మనము ఎదుటివారిని గౌరవించాలి అలాగే ఎదుటివారిని అభినందించడం అలవరచుకోవాలి.



ఇక్కడ ఒక చిన్న కథను గుర్తుచేసుకుందాం! ఒకసారి చేతి ఐదు వ్రేళ్ళ మధ్య పోట్లాట జరిగింది. ప్రతి వ్రేలు అదే గొప్పదని, అత్యంత అవసరమైనదని తీర్మానించుకోసాగాయి. చిటికెనవ్రేలు అన్నది కదా "నేను చిన్నగా ఉన్నప్పటికీ నేనే అత్యంత అవసరమైన దానిని. ఎవరైనా నమస్కారము చేసికొనడానికి ముందు నేనే స్వచ్ఛందముగా నిలబడతాను, అంకెలను లెక్కబెట్టేటప్పుడు కూడా నేనే ముందుంటాను". అప్పుడు ఉంగరపువ్రేలు "నేనే అందరికన్నా గొప్పదాన్ని - ఎందుకంటే రాజు నుండి సామాన్యునివరకు అందరూ విలువైన నవరత్నాల పొడులతో తయారుచేసిన ఉంగరములను ధరించి నన్ను గౌరవిస్తారు. అందుకే నన్ను ఉంగరపు వ్రేలు అనడం పరిపాటి." అన్నది. అప్పుడు మధ్యవ్రేలు గర్వముతో "నేనే అందరికన్నా పొడవైన దానిని. దానిని మించి నాకు ఇరువైపులా ఇద్దరిద్దరు రక్షణ కల్పించే సేవకులు ఉండడం విశేషమైన గుర్తింపు." అన్నది. అప్పుడు చూపుడువ్రేలు "ఒక వ్యక్తిలో మంచి, చెడు గుర్తించి, నిర్ధారణచెయ్యడానికి నేనే అధికారిని." అని ఉద్ఘాటించింది. చివరిగా బొటనవ్రేలు చిరునవ్వుతో "మీరంతా దేనిగురించి ప్రగల్భములు పలుకుతున్నారు? నా సహాయములేకుండా మీరు ఏమీ చెయ్యలేరు." అన్నది. వాస్తవానికి ఒక్కొక్క వ్రేలు ఒక్కొక్క విధముగా ప్రత్యేకమైనది అన్న విషయము మనందరికి తెలిసినదే! ఐదు వ్రేళ్ళు కలిసినపుడే మనము ఏ పనినైనా సక్రమముగా చెయ్యగలము.

***ఈ కథ వలన నేర్చుకున్న నీతి ఏమిటి?***

సమైక్యతను గురించి దేశములు, మతములు సరియైన అవగాహన కలిగి ఉంటే, ప్రపంచములో యుద్ధములుగాని, ద్వేషభావనగాని ఉండేవికావు. ప్రపంచశాంతిని కాంక్షిస్తూ ఇతరుల సంస్కృతి, నమ్మకాలను గౌరవించడం సాధన చేద్దాం!

**శ్రీ దక్షిణామూర్తి ప్రార్థన:**

గురవే సర్వలోకానం
భిషజే భవరోగిణాం
నిధయే సర్వ విద్యానాం
దక్షిణామూర్తయే నమ:

*